క్లుప్తంగా

ఆహ్లాదకరంగా డివైడర్‌లు



మధురానగర్(విజయవాడసెంట్రల్): నగరంలోని 32వ డివిజన్ అయోధ్యనగర్ లోటస్ ల్యాండ్ మార్క్‌లోని డివైడర్‌లను నగరపాలక సంస్థ అధికారులు సుందరంగా ఆహ్లాదకరంగా తీర్చిదిద్దుతున్నారు. ఇక్కడ డివైడర్‌లు, ఖాళీ ప్రదేశాలలో పూల మొక్కలు, గ్రీన్ మ్యాట్‌లను వేశారు. అధ్వానంగా మారిన డివైడర్‌లలోని మొక్కలను మార్చారు. దీంతో స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

దాసాంజనేయుని హుండీ కానుకల ఆదాయం రూ.3,05,186

మధురానగర్(విజయవాడసెంట్రల్): స్వయంభూ మాచవరం దాసాంజనేయ స్వామివారి దేవాలయంలో భక్తులు హుండీలలో సమర్పించిన కానుకల ద్వారా రూ.3లక్షల 5వేల 186 ఆదాయం లభించింది. స్థానిక మాచవరం దాసాంజనేయస్వామి వారి దేవాలయంలో బుధవారం దేవదాయ శాఖ ఇన్‌స్పెక్టర్ అనురాధ పర్యవేక్షణలో హుండీ కానుకల లెక్కింపు జరిగింది. గత 50 రోజులకు గానూ భక్తులు సమర్పించిన కానుకలను ఆలయ సిబ్బంది, భక్తులు లెక్కించారు. కార్యక్రమాలను ఆలయ కార్యనిర్వహణాధికారి నాగినేని భవాని పర్యవేక్షించారు.

వైభవంగా ఏకాదశ రుద్రాభిషేక, శ్రీ చక్రనవావరణార్చన



విజయవాడకల్చరల్: భారతీ తీర్థ మహాస్వామి 74వ జన్మదినం సందర్భంగా దుర్గాపురంలోని శివరామకృష్ణ క్షేత్రంలో నిర్వహిస్తున్న వైదిక కార్యక్రమాలు అత్యంత వైభవంగా జరుగుతున్నాయి. బుధవారం ఉదయం 8 గంటలకు మహాన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకం, మహాన్యాసం, శ్రీ చక్రనవావరణార్చన, సాయంత్రం ఆది దంపతులకు త్రిశతి, మహా మంగళ హారతి, వేదాశీర్వచనం నిర్వహించారు. వేదపండితులు చతుర్వేద పారాయణం పఠించారు. క్షేత్ర ధర్మాధికారి శిష్టా హనుమత్ ప్రసాద్ శృంగేరీ పీఠ ఉత్తరాధికారి విధుశేఖర భారతి మహాస్వామి ఆదేశంతో 73 రోజుల పాటు 15 మంది రుత్వికులచే కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఏప్రిల్ 18 వ తేదీ పూర్ణాహుతితో కార్యక్రమాలు పూర్తవుతాయని తెలిపారు.

ద్విచక్ర వాహనం ఢీకొని సైక్లిస్టుకు గాయాలు

మధురానగర్(విజయవాడసెంట్రల్): ద్విచక్ర వాహనం ఢీకొని వ్యక్తి గాయపడిన ఘటన గుణదల పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం వాంబే కాలనీకు చెందిన దొండపేటి రాంబాబు బార్‌లో పనిచేస్తున్నాడు. ఆయన ఈనెల 25వ తేదీ రాత్రి 11.30 గంటల ప్రాంతంలో బార్ నుంచి ఇంటికి సైకిల్‌పై వెళ్తుండగా భవానీ బార్ నున్న సెంటర్ వద్దకు వచ్చేసరికి వేగంగా వచ్చిన ద్విచక్ర వాహన చోదకుడు ఢీ కొట్టాడు. దీంతో గాయపడిన రాంబాబు ఆసుపత్రిలో చికిత్స చేయించుకున్నాడు. బుధవారం గుణదల పోలీస్‌స్టేషన్‌లో రాంబాబు ఫిర్యాదుచేయడంతో గుణదల పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

30న రన్ ఫర్ జీసస్

లబ్బీపేట(విజయవాడతూర్పు): క్రైస్తవుల పవిత్రమైన గుడ్‌ఫ్రైడే, ఈస్టర్ పర్వదినాలను పురస్కరించుకుని ఈ నెల 30న రన్ ఫర్ జీసస్ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఆ కార్యక్రమం ఏపీ స్టేట్ కో ఆర్డినేటర్ రెవరెండ్ బెల్లంకొండ శివాజీరాజు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 5.30 గంటలకు రాష్ట్ర వ్యాప్తంగా 370 కేంద్రాల్లో జరిగే కార్యక్రమంలో బిషప్‌లు, ఫ్రీస్టులు, పాస్టర్స్ పాల్గొంటారన్నారు.

వివాహిత అదృశ్యంపై కేసు

సత్యనారాయణపురం(విజయవాడసెంట్రల్): వివాహిత అదృశ్యంపై భర్త ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. వజ్జా రమేష్ కుటుంబ సభ్యులతో కలసి పూర్ణానందంపేట, జోసఫ్‌స్ట్రీట్‌లో నివాసముంటున్నారు. భార్యాభర్తలు వేర్వేరు ప్రైవేటు సంస్థలో ఉద్యోగాలు చేస్తున్నారు. ఈ క్రమంలో భార్య తనతో పాటు పనిచేసే తోటి ఉద్యోగికి ఆమె పేరుమీద లోన్‌లు ఇప్పించింది. ఈ విషయం తెలియడంతో భర్త ఎందుకు ఇప్పించావంటు అడిగాడు. దీంతో ఆమె భర్తకు తెలియకుండా ఇంట్లోని బంగారు ఆబరణాలను తోటి ఉద్యోగికి ఇచ్చి లోన్లు క్లియర్ చేయించింది. ఈ విషయం కూడా తెలియడంతో బంగారం ఎందుకు ఇచ్చావంటు భర్త మందలించాడు. ఆనంతరం మంగళవారం ఉదయం 9 గంటలకు భర్త ఆఫీస్‌కు వెళ్లిపోయాడు. మధ్యాహ్నం 12.45 గంటల సమయంలో భార్య ఫోన్ చేసి తాను ఇంటి నుంచి వెళ్లిపోతున్నానని చెప్పి స్విచ్ఛాఫ్ చేసింది. వెంటనే అతను ఇంటికి వెళ్లి చూడగా భార్య కనిపించలేదు. దీంతో చుట్టుపక్కల, బంధువుల వద్ద వెతికినా ఆచూకీ లభ్యం కాలేదు. దీంతో తన భార్య కనిపించడం లేదంటు ఎస్ఎన్‌పురం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. దీనిపై ఉమెన్ మిస్సింగ్ కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

వైఎస్సార్‌సీపీ హయాంలోనే అభివృద్ధి

వైఎస్సార్‌సీపీ సెంట్రల్ ఎమ్మెల్యే అభ్యర్థి వెలంపల్లి శ్రీనివాసరావు



ప్రింటింగ్ ప్రెస్‌లో కార్మికులతో మాట్లాడుతున్న వెలంపల్లి శ్రీనివాసరావు

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చిన తర్వాతే సెంట్రల్ నియోజకవర్గంలో అభివృద్ధి జరిగిందని ఆ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి వెలంపల్లి శ్రీనివాసరావు అన్నారు. నగరంలోని 36వ డివిజన్ పరిధిలోని హనుమాన్‌పేటలో బుధవారం వైఎస్సార్‌సీపీ సెంట్రల్ నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి వెలంపల్లి శ్రీనివాసరావు పర్యటించారు. 36వ డివిజన్ కార్పొరేటర్ బాలి గోవింద్‌తో కలిసి ఇంటింటి ప్రచారం నిర్వహించారు. వైఎస్సార్‌సీపీ ముద్రించిన కరపత్రాలను పంపిణీ చేశారు. ప్రతి ఇంటికీ వెళ్లి ఓట్లను అభ్యర్థించారు. ప్రింటింగ్ ప్రెస్‌లు, డిజిటల్ సంస్థల్లో పనిచేస్తున్న కార్మికులతో ముచ్చటించారు. ఈ సందర్భంగా వెలంపల్లి మాట్లాడుతూ డివిజన్ ప్రజల నుంచి చక్కటి స్పందన లభిస్తోందన్నారు. ఎక్కడకు వెళ్లినా ప్రజలు నీరాజనాలు పలుకుతున్నారన్నారు. ఎదురేగి ఆశీర్వదిస్తున్నారన్నారు. డివిజన్ ప్రజలు తన దృష్టికి తీసుకువచ్చిన సమస్యలను సావధానంగా విన్నారు. ఎన్నికల అనంతరం సమస్యలన్నింటిని తప్పక పరిష్కరిస్తామన్నారు. ప్రతి నెలా ఒకటో తేదీన ఇంటివద్ద పెన్షన్ కానుక అందజేస్తున్న వైఎస్ జగన్‌ను మరోసారి ముఖ్యమంత్రిని చేసుకుంటామని లబ్ధిదారులు చెప్పడం సంతోషంగా ఉందన్నారు.

అభివృద్ధిని విస్మరించిన బొండా ఉమా

గతంలో ఐదేళ్లు ఎమ్మెల్యేగా పని చేసిన బొండా నియోజకవర్గానికి చేసిందేమీ లేదని వెలంపల్లి అన్నారు. ఎక్కడి సమస్యలు అక్కడే ఉన్నాయన్నారు. చంద్రబాబు అమరావతి పేరుతో విజయవాడ అభివృద్ధిని తుంగలోకి తొక్కారన్నారు. ఎన్నికలు సమీపించడంతో చంద్రబాబు మాయ మాటలతో ముందుకు వస్తున్నారన్నారు. గుంపులు గుంపులుగా వచ్చినా రాబోయే ఎన్నికల్లో గెలిచేది జగన్ మోహన్ రెడ్డే అని అన్నారు. మాట మీద నిలబడ లేని వ్యక్తి చంద్రబాబు అని విమర్శించారు. ఈ రాష్ట్రాన్ని దోచుకున్న దొంగలు టీడీపీ, బీజేపీ, జనసేన అని దుయ్యబట్టారు. జగన్ మోహన్‌రెడ్డికి జన బలం ఉందన్నారు. తమ ప్రభుత్వంలో మేలు జరిగితేనే ఓటు వేయమని అడుగుతున్న ఏకైక వ్యక్తి వైఎస్ జగన్ అని కొనియాడారు. వచ్చే ఎన్నికల్లో ప్రలోభాలకు లొంగ కుండా దొంగ కూటమికి బుద్ధి చెప్పాలన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు లఖంరాజు సునీత, బోను రాజేష్, కమ్మిలి రత్నకుమార్, వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు, అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

వెలంపల్లి విజయాన్ని కాంక్షిస్తూ ఇంటింటా ప్రచారం



64వ డివిజన్ కండ్రికలో ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న కార్పొరేటర్ యరగొర్ల తిరుపతమ్మ

పాయకాపురం(విజయవాడరూరల్): వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ సెంట్రల్ నియోజకవర్గం అభ్యర్థి వెలంపల్లి శ్రీనివాసరావు విజయాన్ని కాంక్షిస్తూ బుధవారం 64వ డివిజన్ కండ్రికలో కేర్ అండ్ షేర్ స్కూల్ దగ్గర నుంచి ఇంటింటా ఎన్నికల ప్రచారం నిర్వహించారు. రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించారు. వచ్చే ఎన్నికల్లో ఫ్యాను గుర్తుకు ఓట్లు వేసి ఎమ్మెల్యే అభ్యర్థి వెలంపల్లి శ్రీనివాసరావు, ఎంపీ అభ్యర్థి కేశినేని శ్రీనివాస్(నాని)లను భారీ మెజార్టీతో గెలిపించాలని ఓటర్లకు విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ డివిజన్ అధ్యక్షుడు షేక్ ఇస్మాయిల్, డివిజన్ ఇన్‌చార్జి జలసూత్రం శ్రీనివాసరావు, పార్టీ నాయకులు యరగొర్ల శ్రీరాములు, కొక్కిలిగడ్డ నాని, మాతా మహేష్, జగన్, వెంకటేశ్వరమ్మ, లక్ష్మణ పాల్గొన్నారు.

రిటైనింగ్ వాల్ ఘనత సీఎం జగన్‌దే



చిరు వ్యాపారులతో మాట్లాడుతున్న వెలంపల్లి శ్రీనివాస్, కేశినేని నాని తదితరులు

గుణదల(విజయవాడ తూర్పు): వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తరువాత రాష్ట్రం అభివృద్ధి దిశగా పరుగులు తీస్తోందని ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాస్ అన్నారు. గుణదల 1వ డివిజన్ పరిధిలోని కాల్వగట్టు ప్రాంతంలో బుధవారం ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రజా సంక్షేమంతో పాటు రాష్ట్రాన్ని మౌలికంగా అభివృద్ధి పరిచేందుకు సీఎం జగన్ మోహన్ రెడ్డి నిబద్ధతగా పనిచేశారని తెలిపారు. కులమతాలకు అతీతంగా రాష్ట్రంలో సంక్షేమ పాలన సాగుతోందన్నారు. ముఖ్యంగా విజయవాడ నగరం ఇటీవల కాలంలో మరింత అభివృద్ధి సాధించిందని చెప్పారు. కృష్ణలంక ప్రాంతంలో రూ.500 కోట్లతో కృష్ణానది ఒడ్డున రిటైనింగ్ వాల్ నిర్మించిన ఘనత సీఎం జగన్‌కే దక్కుతుందని తెలిపారు. బడుగు బలహీన వర్గాల అభ్యున్నతికి కృషి చేసిన మహనీయుడు, భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహాన్ని ఏర్పాటు చేయటం ద్వారా విజయవాడ నగరానికి మరింత విశిష్టత సంతరింపజేశారన్నారు. సీఎం జగన్ ఆశయాలకు అనుగుణంగా నగరాభివృద్ధిలో ఎంపీ కేశినేని శ్రీనివాస్ (నాని) కృషి చేస్తున్నారని అభిప్రాయపడ్డారు. గత ప్రభుత్వ హయాంలో చంద్రబాబు సహకరించకపోయినా విజయవాడకు నిధులు సమకూర్చి మౌలికాభివృద్ధికి కృషిచేశారని కేశినేని నానిని అభినందించారు. 40 సంవత్సరాల రాజకీయ అనుభవం వున్న వ్యక్తిగా చలామణీ అవుతున్న చంద్రబాబు వైఎస్సార్ సీపీ పాలన చూసి సిగ్గు తెచ్చుకోవాలని హితవు పలికారు.

చంద్రబాబు అరాచకం సృష్టిస్తున్నారు...

వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో తాను ఓడిపోతానన్న భయంతో టీడీపీ అధినేత చంద్రబాబు రాష్ట్రంలో అరాచకాలు సృష్టించే ప్రయత్నం చేస్తున్నారని ఎంపీ కేశినేని నాని విమర్శించారు. ముఖ్యంగా శాంతి భద్రతలకు విఘాతం కలిగించే దిశగా చిల్లర రాజకీయాలకు తెరతీస్తున్నారని దుయ్యబట్టారు. ఓటర్లను తనవైపు తిప్పుకునేందుకు దేనికైనా దిగజారే పరిస్థితిలో చంద్రబాబు ఉన్నారని తెలిపారు. దీనిలో భాగంగా తన అనుచరులతో చంద్రబాబు నాయుడు 25వేల కిలోల గంజాయిని సమీకరించారని, దీని ద్వారా అల్లర్లకు తెరతీసే ప్రయత్నాలు జరుగుతున్నాయని వివరించారు. చంద్రబాబు ఎన్ని కుట్రలు పన్నినా వచ్చే ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ విజయం సాధించడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. అనంతరం ఇంటింటికీ తిరిగి స్థానికులను కలుసుకున్నారు. కార్యక్రమంలో 1వ డివిజన్ కార్పొరేటర్ ఉద్దంటి సునీత, స్థానిక నాయకులు కొండా వెంకటేశ్వరరెడ్డి, ఆళ్ల ప్రసాద్ రెడ్డి, ఉద్దంటి సురేష్, శివ, వేణు తదితరులు పాల్గొన్నారు.

● హమ్మయ్య... ఓ పనై పోయింది!



విజయవాడ పటమట లోని కోనేరు బసవయ్య చౌదరి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదవ తరగతి పరీక్షలు పూర్తవటంతో పరీక్ష కేంద్రం నుంచి వస్తున్న విద్యార్థులు

– సాక్షి ఫొటోగ్రాఫర్, విజయవాడ

కుమారుడు కనిపించడం లేదని ఫిర్యాదు

పాయకాపురం(విజయవాడరూరల్): ఫొటో స్టూడియోలో పనిచేస్తున్న పలగాని మహేష్(27) గత రెండు రోజులుగా కనిపించడం లేదని అతని తండ్రి పలగాని సుబ్బయ్య బుధవారం నున్న పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. కుందావారి కండ్రికకు చెందిన పలగాని మహేష్ విజయవాడలోని ఒక ప్రైవేటు ఫొటో స్టూడియోలో పనిచేస్తుంటాడు. 2022వ సంవత్సరంలో ప్రేమ వివాహం చేసుకున్న మహేష్ భార్యతో మనస్పర్థల కారణంగా గత 8 నెలలుగా విడిగా ఉంటున్నాడు. ఈ నెల 26వ తేదీన డ్యూటీకి వెళ్లిన మహేష్ మధ్యాహ్నం 3 గంటల నుంచి ఎక్కడికో వెళ్లినట్టు ఫొటోస్టూడియో యజమాని ఫోను చేశాడని మహేష్ తండ్రి సుబ్బయ్య తెలిపాడు. సుబ్బయ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఫ్యాను గుర్తుకు ఓటు–అభివృద్ధికి చోటు



ఫ్యాను గుర్తుకు ఓట్లు వేయాలని అభ్యర్థిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

మధురానగర్(విజయవాడసెంట్రల్): ఫ్యాను గుర్తుకు ఓటు–అభివృద్ధి సంక్షేమానికి చోటు అని వైఎస్సార్‌సీపీ 32వ డివిజన్ ఇన్‌చార్జి గుండే సుందర్‌పాల్ అన్నారు. స్థానిక 32వ డివిజన్ అయోధ్యనగర్‌లో బుధవారం సాయంత్రం మల్లాది విష్ణు ఆదేశాల మేరకు వైఎస్సార్‌సీపీ అభ్యర్థుల విజయాన్ని కాంక్షిస్తూ మేము సిద్ధం..మా బూత్ సిద్ధం పేరిట ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా వైఎస్సార్‌సీపీకి ఓటు వేయాల్సిన ఆవశ్యకతను వివరించారు. వైఎస్సార్‌సీపీ మహిళా విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పేరం త్రివేణి రెడ్డి మాట్లాడుతూ మహిళలందరూ సంఘటితంగా ఉండి జగనన్న గెలుపునకు కృషి చేయాలని సూచించారు.నవరత్నాలతో మహిళల జీవితాలలో నూతన వెలుగులు నింపిన జగనన్నకు యావత్ మహిళాలోకం అండగా ఉంటుందని అన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు, గృహసారథులు, కన్వీనర్‌లు, కార్యకర్తలు స్వచ్ఛందంగా పాల్గొన్నారు.

డివైడర్‌ను ఢీకొని యువకుడికి గాయాలు

మధురానగర్(విజయవాడసెంట్రల్): ప్రమాదవశాత్తూ డివైడర్‌ను ఢీకొని ఆటో డ్రైవర్ గాయపడిన ఘటన గుణదల పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం శాంతినగర్‌కు చెందిన వేముల చక్రవర్తి (21) ఆటో డ్రైవర్‌గా పనిచేస్తున్నారు. ఈయన ఈనెల 25వ తేదీ రాత్రి హోలీ సందర్భంగా స్నేహితులను కలిసి రామవరప్పాడు వెళ్లి తిరిగి ఫ్లైఓవర్‌పై నుంచి ద్విచక్రవాహనంపై వస్తుండగా ప్రమాదవశాత్తూ డివైడర్‌ను ఢీకొట్టాడు. గాయపడిన చక్రవర్తిని స్థానికులు ఆసుపత్రికి తరలించారు. సమాచారం అందుకున్న గుణదల పోలీసులు బుధవారం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.





అమ్మవారి దర్శనానికి పోటెత్తిన భక్తులు



పెనుగంచిప్రోలు: శ్రీతిరుపతమ్మ అమ్మవారి చినతిరునాళ్ల మూడోరోజు బుధవారం భక్తులు పోటెత్తారు. తెల్లవారు జాము నుంచే భక్తులు మునేరులో స్నానాలు చేసి పాలు, పొంగళ్లతో అమ్మవారిని దర్శించుకొని బోనాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. దూరప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు మునేరులో పెద్ద ఎత్తున గుడారాలు ఏర్పాటు చేసుకున్నారు. భక్తులు రాత్రి సమయంలో ఆలయ ప్రాంగణంలో బుర్రకథలు, సాంస్కృతిక కార్యక్రమాలు చూస్తూ కాలక్షేపం చేశారు. ఎగ్జిబిషన్ వద్ద భక్తులు కోలాహలం కనిపించింది. భక్తులకు ఇబ్బంది లేకుండా గ్రామంలో పంచాయతీ ఆధ్వర్యంలో పారిశుద్ధ్య చర్యలు నిర్వహిస్తున్నారు.

అహంకారి బొండా ఉమా

- దోచుకోవడం.. దాచుకోవడం తప్ప ఆయన చేసిందేమీ లేదు
- నాడు 17 మంది టీడీపీ కార్పొరేటర్లు ఉంటే ఇప్పుడు ముగ్గురు కూడా ఆయన దగ్గర లేరు
- వైఎస్సార్‌సీపీ కార్పొరేటర్లను ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు, ఛైర్మన్‌లను చేసిన సీఎం జగన్
- టీడీపీ నాయకులు వాస్తవాలు గ్రహించి నిర్ణయం తీసుకోవాలి
- దమ్ముంటే ఇండిపెండెంట్‌గా పోటీచేసి గెలవాలి
- బొండాకు టీడీపీ మాజీ కార్పొరేటర్ల సవాల్



మాట్లాడుతున్న మాజీ కార్పొరేటర్లు నందెపు సురేష్, గండూరి మహేష్, మణి

అజిత్‌సింగ్‌నగర్(విజయవాడసెంట్రల్): ఎస్సీలు, బీసీలు, ముస్లిం మైనార్టీలు, బ్రాహ్మణులు, వైశ్యులంటే టీడీపీ నాయకుడు బొండా ఉమాకు చాలా చులకన. ఆయన పెద్ద అహంకారి. పార్టీలో ఆయన, ఆయన కుమారులు తప్ప వేరే వారెవరిని ఆయన ఎదగనీయడని టీడీపీ మాజీ కార్పొరేటర్లు నందెపు జగదీష్, గండూరి మహేష్, కోసూరి మణి ఆరోపించారు. సింగ్‌నగర్ ఆంధ్రప్రభ కాలనీ లోని సెంట్రల్ వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో బుధవారం వారు విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ బొండా ఉమా రాజకీయ ఉన్మాది అని, పార్టీని, తనను నమ్ముకున్న వారిని అడ్డం పెట్టుకొని ఆయన కోట్ల రూపాయలు దోచుకోవడం, దండుకోవడం తప్ప ఎవరికీ ఏమీ చేసింది లేదని మండిపడ్డారు. బొండా ఉమా గెలుపు కోసం, ఆయన సీటు కోసం చొక్కాలు చింపుకొని, కోట్ల రూపాయలు వెచ్చించి పనిచేస్తే చివరికి తమనే హింసించడం, సొంతపార్టీ వారమని కూడా చూడకుండా తమ ఓటమికి ఆయన దిగజారుడు రాజకీయాలు చేయడం సిగ్గుచేటన్నారు.

వైఎస్సార్‌సీపీ కార్పొరేటర్లు ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు అయ్యారు

తాము గత 20 ఏళ్లుగా టీడీపీలో పనిచేస్తున్నా, కనీసం తమను కార్పొరేటర్లుగా కూడా గెలవనీయకుండా అడ్డుకున్నారని, తమ తోటి వైఎస్సార్‌సీపీ కార్పొరేటర్లను ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఎమ్మెల్యేలుగా, ఎమ్మెల్సీలుగా, కార్పొరేషన్ ఛైర్‌పర్సన్లుగా చేశారని అన్నారు. ఎండీ కరీమున్నీసాకు ఎమ్మెల్సీ, వన్‌టౌన్‌లో ఆసిఫ్‌కు కార్పొరేషన్ ఛైర్మన్, ఇప్పుడు ఎమ్మెల్యే టికెట్, బండి పుణ్యశీల, జమల పూర్ణమ్మలకు కార్పొరేషన్ ఛైర్‌పర్సన్ పదవులు, అవుతు శ్రీశైలజకు డిప్యూటీ మేయర్ పదవులను ఇచ్చి గౌరవించారన్నారు. పార్టీలో కష్టపడే వారికి గుర్తింపు ఇచ్చేది వైఎస్సార్‌సీపీనే అని నమ్మి తామంతా ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి సమక్షంలో ఆ పార్టీలో చేరామని చెప్పారు. టీడీపీ నాయకులు ఇప్పటికైనా బొండా ఉమా నిజస్వరూపాన్ని తెలుసుకొని సెంట్రల్ నియోజకవర్గంలో వెలంపల్లి శ్రీనివాసరావును గెలిపించేందుకు తమతో చేతులు కలపాలని పిలుపునిచ్చారు. మాజీ ఫ్లోర్ లీడర్ కొక్కిలిగడ్డ దేవమణి, గోరంట్ల శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

అన్ని వర్గాలకు సంక్షేమ పథకాల లబ్ధి



పోస్టర్ విడుదల చేస్తున్న క్రిస్టియన్ నాయకులు

గుణదల (విజయవాడ తూర్పు): సార్వత్రిక ఎన్నికలు సమీపిస్తున్న ప్రస్తుత తరుణంలో ప్రజలంతా వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీని గెలిపించేందుకు సిద్ధంగా ఉన్నారని అసోసియేషన్ ఆఫ్ ఇంటిగ్రేటెడ్ క్రిస్టియన్ కౌన్సిల్ జాతీయ అధ్యక్షుడు గేరా హనోక్ అన్నారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తలపెట్టిన బస్సు యాత్రకు సంఘీభావం ప్రకటించారు. ఈ మేరకు వైఎస్సార్ సీపీ తూర్పు కార్యలయంలో బుధవారం విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజా సంక్షేమం కోసం జగనన్న అహర్నిశలు కృషి చేస్తున్నారని తెలిపారు. ఆయన కృషి ఫలితంగానే రాష్ట్రంలో అన్ని వర్గాల ప్రజలు లబ్ధి పొందారని పేర్కొన్నారు. కుల మతాలకు అతీతంగా అందరికీ సంక్షేమ ఫలాలు అందించడంలో ఆయన నిబద్ధతగా పనిచేశారని చెప్పారు. క్రైస్తవ నాయకులు సైతం సీఎం జగన్ కు తోడుగా బస్సు యాత్రలో పాల్గొని ప్రోత్సహిస్తామని వివరించారు. అనంతరం పోస్టర్ ను ఆవిష్కరించారు. నాయకులు ప్రభుదాస్, డానియేల్ బోస్, జీవరత్నం, జాన్‌వెస్లీ తదితరులు పాల్గొన్నారు.

బంగారం, నగదు తీసుకుని భార్య పరార్

గుణదల పోలీస్ స్టేషన్‌లో భర్త ఫిర్యాదు

మధురానగర్(విజయవాడసెంట్రల్): తనతో వివాహం కాకముందే వేరొకరితో తన భార్యకు వివాహం అయిందని తెలిసి, ఆ విషయం నిలదీయగా ఇంట్లో ఉన్న బంగారం, నగదు తీసుకుని భార్య పరారైంది. ఈ విషయమై బాధితుడు బుధవారం గుణదల పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. బుడమేరు వంతెన లెనిన్‌నగర్‌కు చెందిన కలిగట్ల రంగారావు నగరంలోని ఓ ప్రైవేట్ ప్రింటింగ్ ప్రెస్‌లో ఆపరేటర్‌గా పని చేస్తున్నారు. ఈయనకు 2018లో షాదీ డాట్.కామ్‌లో ఒడిశా రాష్ట్రంలోని జైపూర్‌కు చెందిన రేణుక పరిచయం అయింది. కులాలు వేరయినప్పటికీ రంగారావు పెద్దల సమక్షంలో రేణుకను వివాహం చేసుకున్నారు. వీరికి ఒక బాబు ఉన్నాడు. రేణుకకు ఇంతకుముందే వేరే వివాహం అయిందని ఇటీవల రంగారావుకు తెలిసింది. అప్పటి నుంచి ఇద్దరి మధ్య గొడవలు ప్రారంభమయ్యాయి. రేణుక రంగారావుతో గొడవ పడి ఇంట్లో ఉన్న 66 గ్రాముల బంగారు నగలు, రూ.1.56 లక్షల నగదు తీసుకుని జైపూర్ వెళ్లిపోయింది. రంగారావు ఫోన్ చేసి అడగ్గా రేణుక బంధువులు చంపేస్తామంటూ బెదిరించారు. దీంతో బుధవారం సాయంత్రం రంగారావు గుణదల పోలీసులను ఆశ్రయించారు. బాధితుని ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

చాముండి గోల్డ్, డైమండ్ షోరూమ్ ప్రారంభం



షోరూమ్ ప్రారంభోత్సవంలో పూజా కార్యక్రమం నిర్వహిస్తున్న అధినేత చిల్లపల్లి శ్రీకర్

లబ్బీపేట(విజయవాడతూర్పు): వస్త్ర వ్యాపార రంగంలో అగ్రగామిగా నిలిచిన చిల్లపల్లి నాగేశ్వరరావు అండ్ సన్స్ ఆధ్వర్యంలో పిన్నమనేని పాలిక్లినిక్ రోడ్డులో ఏర్పాటు చేసిన చాముండి గోల్డ్, డైమండ్ షోరూమ్‌ను బుధవారం లాంఛనంగా ప్రారంభించారు. నాణ్యమైన బంగారు, వజ్రాభరణాలను అందిస్తూ వినియోగదారుల ఆదరణ, నమ్మకం పొందుతున్న తాము, ప్రజలకు మరింత అందుబాటులో ఉండాలని నూతన షోరూమ్ ఏర్పాటు చేసినట్లు షోరూమ్ అధినేత చిల్లపల్లి శ్రీకర్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వివాహాది, ఇతర శుభకార్యాలకు వినియోగదారులు కోరుకునే సరికొత్త మోడల్స్‌లో సంప్రదాయాలు ప్రతిబింబించేలా బంగారు, వజ్రాభరణాలు అందిస్తున్నట్లు తెలిపారు. డైమండ్‌లో విక్టోరియన్, పోల్కి డైమండ్స్ కలెక్షన్స్ , బంగారంలో యాంటిక్ జ్యూయలరీ, టెంపుల్ జ్యూయలరీ, అమృత్‌సర్‌కలెక్షన్స్‌తో పాటు వివిధ ఆభరణాలను అందుబాటులో ఉంచినట్లు ఆయన తెలిపారు.

ఉత్సవాల ఏర్పాట్లు పరిశీలన

పెనుగంచిప్రోలు: శ్రీతిరుపతమ్మ చిన్న తిరునాళ్లను పురస్కరించుకుని గురువారం నిర్వహించే అమ్మవారి పుట్టింటి పసుపు–కుంకుమ కార్యక్రమాన్ని అందరూ విజయవంతం చేయాలని నందిగామ ఏసీపీ డా.రవికిరణ్ కోరారు. పసుపుకుంకుమ బండ్ల రాకపోకలకు సంబంధించి ఆలయ పరిసరాల్లో చేసిన ఏర్పాట్లను బుధవారం ఆయన పరిశీలించారు. ఆలయ అధికారులకు పలుసూచనలు చేశారు. మునేరులో భక్తులతో మాట్లాడి ఉత్సవాల ఏర్పాట్లు అడిగి తెలుసుకున్నారు. ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున నిబంధనలు అతిక్రమిస్తే కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. డీజీ సౌండ్స్‌కు అనుమతి లేదని స్పష్టం చేశారు. ఆలయ ఈఈ వైకుంఠరావు, ఏఈ రాజు, ఎస్ఐ పి.రాంబాబు పాల్గొన్నారు. శ్రీతిరుపతమ్మవారి ఆలయానికి బుధవారం ఆలయ డోలు విద్యాంసుడు గుంటుపల్లి సత్యనారాయణ సుమారు రూ.20వేల విలువ కలిగిన టేకు ఊయలను ఆలయ ఈవో కె.రమేష్‌నాయుడు చేతుల మీదుగా అందజేశారు.